# ఎంతెంత దూరం...

"ఎంతెంత దూరం..."

"దిబ్బంత దూరం..."

"ఎంతెంత దూరం..."

"దిబ్బంత దూరం...."

పదేళ్ల లక్ష్మి ముందు నడుస్తోంది.

ఆరేళ్ల సురేంద్ర అక్క రెండు భుజాలమీద చేతులేసి, అక్క అడుగులో అడుగేస్తూ "ఎంతెంత దూరం..." అంటున్నాడు. వెంటనే లక్ష్మి "దిబ్బంత దూరం...." అంటూ నడుస్తోంది.

లక్ష్మిది గుండ్రటి ముఖం. తెల్లని రంగు. తలకు ఆముదం రాసి నున్నగా దువ్వి, ఉదయమనగా వాళ్లమ్మ వేసిన రెండు జడలు ఇంకా చెక్కు చెదరలేదు. తలలో పూలు లేని కొరతను ఎర్ర రిబ్బన్లు తీరుస్తున్నాయి.

అక్కా తమ్ముడు బడినుంచి ఇంటికి వస్తానే స్కూలు బట్టలు తీసినట్టులేదు.

ఇద్దరూ నడివీధిని, దిగవీధిని దాటి ఇప్పలగుంట చెరువు కట్ట ఎక్కారు. సురేంద్ర పక్కకు వంగి ముందుకు చూశాడు. కట్టమీద మనుషులెవ్వరూ కనిపించలేదు.

"అమ్మోళ్లు ఇంగా రాలా" అన్నాడు గొణుగుతున్నట్టుగా.

"వస్తార్లేరా... మనం ఆడికి పోయాలకు వచ్చేస్తారు చూసుకో" అంది లక్ష్మి ఉత్సాహంగా.

ఇద్దరూ కట్టకవతల ఉండే చాకిరేవు బండవద్దకు చేరారు. బాట వైపు చూశారు. ఎవరో ఇద్దరు ముగ్గురు మనుషులు వస్తా కనిపించారు.

"అమ్మోళ్ళు కాదు" అన్నాడు సురేంద్ర.

"ఇంగా పనయిపోయిండదు. వస్తార్లే. మనం ఆడుకుందాం పా" అంటా బండ చివర ఎత్తుగా ఉండే చోటుకు పోయింది. అక్కడ నున్నగా ఉండేచోట కూర్చోని కిందకు జారింది. సురేంద్ర కూడా లక్ష్మిని అనుసరించాడు.

చాకిరేవు బండమీద ఆరేసిన బట్టలు మడతబెడుతున్నారు చాకలివాళ్లు.

సూర్యుడు పడమటి కొండల్లోకి పోవడానికి సన్నద్ధమవుతున్నాడు.

"అద్దో... అక్కో... అమ్మోళ్లు..." అంటా కిందకు జారినవాడు జారినట్టే ముందుకు

పరుగుతీశాడు సురేంద్ర. పరిగెడుతూ రాయి తగులుకుని బోర్లా పడ్డాడు. వెనకే వచ్చిన లక్ష్మి వాడినెత్తుకుని సంకలో వేసుకుని ముందుకు నడిచింది.

పిల్లల్ను అమ్మా, నాన్న చూసినట్టున్నారు.

నలుగురి ముఖంలో ఆనందం.

**2**

కొడుకును ఎదురుగా కూర్చోబెట్టుకుని తలకు ఆముదం రాసి దువ్వింది ఈశ్వరమ్మ. ఉన్నవాటిల్లో తక్కువ చిరుగులున్న బట్టలు వేసింది. నుదుటన తిలకంతో బొట్టు పెట్టింది. పెరట్లో మల్లె తీగలోంచి విరిసిన మల్లెపూలు రెండు తెచ్చి కొడుకు రెండు చెవుల్లో పెట్టింది. ఒకసారి కొడుకు ముఖాన్ని పరిశీలనగా చూసి బుగ్గన ముద్దు పెట్టుకుంది. అంతకు ముందే లక్ష్మికి తలదువ్వేసి, బట్టలు వేసింది.

"మల్లి చెట్టు పెద్దది కానీలే. నీకు జడలోకి పూలు పెడతా" అంది కూతురుతో.

"ముచ్చట్లాడింది చాల్లేబ్బా... ఎలబారు. సుండుపల్లి బస్సు ఎల్లిపోతాది" తొందరచేశాడు రెడ్డెన్న.

"అయిపాయబా... యాడంటే ఆడ తిరగద్దండి. అక్క చెప్పినట్లు ఇను. సంగటి చేసిండా. వూరిమిండి వుండాది. ఈ పొద్దు ఇంట్లోనే తినేయండి. రేత్తిరికి అత్తోళ్ల ఇంట్లో పడుకోండి. మేము నాలుగు దినాల్లో వస్తాం. అత్తకు చెప్పిండా. సద్దలు ఇచ్చినా. ఈ నాలుగు దినాలు అన్నే తినేసి బడికి పోండి. పిల్లోళ్లతో చేరి కొట్లాడుకోకుండా ఇంటికాన్నే ఉండండి" అక్కా తమ్మునికి ఒకేసారి జాగ్రత్తలు చెప్పింది ఈశ్వరమ్మ.

"ఇప్పటికి నూరుసార్లు చెప్పింటావు. ఎలబారు" అంటూ వీధిలోకి పోయాడు రెడ్డెన్న.

బట్టలు, సంగటి ఉండే చేతి సంచిని తీసుకుని ఈశ్వరమ్మ కూడా వీధిలోకి అడుగుపెట్టింది. లక్ష్మి ఇంటికి తాళం వేసి వాళ్ల వెనకే బయలుదేరింది.

కొడుకును సంకలోకి తీసుకునింది ఈశ్వరమ్మ.

అందరూ సాయిబుల వీధి దాటి గానుగ చింతమాను కిందకు వచ్చారు.

"దించుబ్బా కొడుకును. మళ్లా నడుచుకోని పోవద్దా" అన్నాడు రెడ్డెన్న నిలబడి.

తల్లి సంకలోనించి కిందకు జారాడు సురేంద్ర.

చెరి రెండు రూపాయలు ఇచ్చి ముందుకు కదిలారు భార్యాభర్తలు.

అమ్మానాన్నలు కనుమరుగయ్యేంతవరకు అక్కాతమ్ముడు చూస్తూ నిలబడుకునే ఉన్నారు. తమ్ముణ్ని వీపు మీద ఉప్పుమూట ఎక్కించుకుని ఇంటికి వచ్చింది లక్ష్మి.

తలుపు తాళం తీసి ఇంట్లోకి పోయింది.

తన దగ్గరున్న రెండు రూపాయలను తన ఈడు పిల్లలకు చూపించడానికి దిగవీధివైపు పరుగులు తీశాడు సురేంద్ర. నడీధి దగ్గరకు పోయేటప్పటికి కమ్మారపల్లె నుంచి పూలమ్మే ఆమె గంపలో పూలతో వచ్చింది. నడీధిలో ఆడవాళ్లు పూలు కొంటావుండారు. పూలామెను చూడగానే సురేంద్ర పరుగు ఆగిపోయింది. నేరుగా ఆమె దగ్గరకు పోయాడు. మల్లెపూలు.... వాసన వస్తున్నాయి.

"ఎంతమ్మోవ్ పూలు..." అడిగాడు.

"పెద్ద మొగోడు వచ్చినాడమ్మో... పావలా మోర... కొంటావా సామీ" అడిగిందామె.

"ఆఁ.... రెండు రూపాయలకీ" అంటా తన దగ్గరున్న రెండు రూపాయలు పూలామె చేతిలో పెట్టాడు సురేంద్ర.

"ఎవరికిరా పూలు..." పూలు కొంటున్న ఒకామె అడిగింది.

"మా అక్కకు" అంటానే పూలు తీసుకుని ఇంటికి పరుగు తీశాడు.

తమ్ముని కోసం వీధిలోకి వచ్చి దిక్కులు చూస్తున్న లక్ష్మి "యాడికి పొయ్యినావురా" అంది.

"పూలు తెచ్చినాక్కా" అంటా గసపోస్తా లక్ష్మి చేతిలో ఎనిమిది మూరల పూలు పెట్టాడు.

"యాడియిరా ఇన్ని పూలు" ఆ పూలను చూడగానే పూర్తిగా విచ్చుకున్న ముద్దబంతిలా వెలిగిపోతావుంది లక్ష్మి ముఖం.

"నాయన రెండు రుపాయలు ఇచ్చినాడు కదా. రెండు రూపాయలకు తెచ్చేసినా"

లక్ష్మి ఇంట్లోకి పోయి పూలను మధ్యలోకి తుంచి మడతబెట్టి రెండు జడల్లో పెట్టుకుంది. గోడకున్న అద్దంలో తలను తిప్పితిప్పి చూసుకుంది. సురేంద్ర కళకళలాడుతున్న పూలను, లక్ష్మి ముఖాన్నే గమనిస్తున్నాడు.

## 3

అమ్మానాన్నా అరిసెలు చేస్తావుంటే, వాళ్లకు సాయం చేస్తూ కూర్చున్నాడు సురేంద్ర.

"నువ్వు పడుకోపో నాయనా... మళ్లా మొబ్బుతోనే నిద్రలెయ్యాల" అంది ఈశ్వరమ్మ.

"నిద్ర రాలేదమ్మా"

"వాడికి నిద్రొస్తాదా.. పద్దన్నే వాళ్లక్క దగ్గరికి పోతాండే సంబరం కదా. నడుచుకోని పొమ్మన్నే ఎళ్లిపోతాడేమో" అన్నాడు రెడ్డెన్న.

"ఏముంది నాయనా... నేను చిన్నప్పుడే పదిమైళ్లు నడిచినా మీ ఎనకంటీ. ఇప్పుడు వాయల్పాడొగలెక్కా... మొబ్బుతోనే దోవకు మళ్లినానంటే మధ్యాన్నానికంతా ఎళ్లిపోతా" ఉత్సాహంగా చెప్పాడు సురేంద్ర.

"ఆc... బళే నడిచే మొగోడుబ్బా ఈడు... పొయ్యి పడుకోపోరా... నిద్ర మేలుకోని వున్నేవంటే మొబ్బుతో బస్సులో పొయ్యేటప్పుడు మెలకవ రాదు... మెలకువ రాలేదనుకో మదనపల్లెకు ఎల్లిపోతావు... పడుకోపో" కొంచెం కోపంగా చెప్పాడు రెడ్డెన్న.

అయిష్టంగానే పోయి చిరుగుల దుప్పటిని కప్పుకుని చాపమీద పడుకున్నాడు సురేంద్ర. పడుకున్నాడే కానీ చాలాసేపటిదాకా నిద్రే రాలేదు వాడికి. వాడి అమ్మానాన్నలు వంటపని ముగించేసి పడుకున్నారు. అంతవరకూ మేలుకునే ఉన్నాడు. ఎప్పటికో కలత నిద్రపట్టింది. ఏవేవో కలలు...

నాలుగు గంటలు కాకముందే నిద్రలేచాడు. పళ్లుతోమి స్నానం చేశాడు. రసం వేసుకుని సద్దన్నం తిన్నాడు.

వాడు అన్నం తింటున్నంతసేపూ "నాయనా... భద్రం.... ఇంతవరకూ ఒగన్నే ఎప్పుడూ అంపలా నిన్ను. రెండు బస్సులు మారిపోవాల. బస్సులో నిద్రపోవద్దు. అక్కకు అత్తిరాసాలు ఇచ్చేసి... అట్లే ఓమనంపల్లెలో అత్తోళ్ల ఇంటికిపో. రేత్తిరికి ఆడ ఉండి పద్దన్నే ఎలబారిరా..." చెప్తానే ఉంది ఈశ్వరమ్మ.

"నాకేం భయం లేదులేమ్మా. పొయ్యొచ్చేస్తా" ఉత్సాహంగా చెప్పాడు సురేంద్ర.

అరిసెలు ఒక చేతి సంచిలో పెట్టి ఇచ్చింది ఈశ్వరమ్మ.

"నీకు ఆఫ్ టిక్కెట్ గదా. చార్జీలకు పదిరూపాయలు కూడా కాదు. నలభై ఇస్తాండా. మీ అక్కకు ఇరవై ఈయి. పూలూ పండ్లూ తీసీ... భద్రంగా పోయిరా" కొడుకు చేతికి డబ్బు ఇచ్చి జాగ్రత్తలు చెప్పాడు రెడ్డెన్న.

కమ్మారపల్లెదాకా తోడు వచ్చి కొడుకును బస్సెక్కించాడు.

లక్ష్మి ఏడవ తరగతి పాసవుతానే వాయల్పాడులో హాస్టల్‌లో చేర్చారు. అక్కడే ఎనిమిదవ తరగతి చదువుతా ఉంది. అప్పటికి లక్ష్మి వాయల్పాడుకు పోయి పది రోజులు అవుతా వుంది. సురేంద్ర నాలుగు రోజులనుంచీ అక్క దగ్గరకు పోవాలని పోరతా ఉంటే, ఈ రోజు పంపించారు.

మొదటిసారి పెద్దవాళ్లు తోడు లేకుండా బస్సెక్కినందుకు సురేంద్రకు విమానం ఎక్కినంత సంబరంగా ఉంది. తొందరగా అక్కను చూడాలని ఉండటంతో బస్సు ఎంత వేగంగా పోతున్నా మెల్లగా పోతున్నట్టే ఉంది వాడికి.

పీలేరులో బస్సు దిగాడు. బస్సు కోసరం అరగంట ఎదురుచూడాల్సి వచ్చింది. మదనపల్లె బస్సు రాగానే ఆదరాబాదరా ఎక్కి కూర్చున్నాడు. బస్సు బయల్దేరింది. కళ్ల మీదున్న నిద్రను బలవంతంగా ఆపుకుంటున్నాడు. వాయల్పాడులో గాంధీ బొమ్మ దగ్గర దిగాడు.

నాయన మాటల్లో అక్క హాస్టల్ దారిని గుర్తు చేసుకున్నాడు.

ఇద్దరు ముగ్గుర్ని దారడిగి హాస్టల్ వద్దకు పోయేటప్పటికి ఎనిమిది గంటలు.

తమ్ముడ్ని చూడగానే లక్ష్మి కళ్లలో మెరుపులు.

తనుంటున్న గది వద్దకు తీసుకుపోయింది. తనతోపాటు తమ్మునికి కూడా హాస్టల్ టిఫిన్ పెట్టింది. ఇద్దరూ మధ్యాహ్నం వరకూ మాటలు చెప్పుకుంటా కూర్చున్నారు. ఆ రోజు రెండో శనివారం కావడంతో పాఠశాలకు సెలవు.

లక్ష్మికి అరిసెలు ఇచ్చి ఓమనంపల్లెకు బయల్దేరాడు సురేంద్ర.

"భద్రం రేయ్... బస్సులు, స్కూటర్లు వస్తాంటాయి. రైలు గేటుకాడ చూసిపో. ఆ పక్క వంక ఉంది. నీళ్లలో దిగద్దు. పక్కనపో" జాగ్రత్తలు చెప్పింది లక్ష్మి.

పదినిముషాల్లో తిరిగొచ్చిన తమ్ముడ్ని చూసి ఆశ్చర్యపోయింది లక్ష్మి.

"పద్దన హాస్టల్ కనుక్కుంటానో లేదో అనుకుంటా మరిచిపోయినాక్కా. ఇప్పుడు తీసుకొనొచ్చినా" అన్నాడు సురేంద్ర. వాడి చేతిలో పూలు పండ్లు ఉన్నాయి.

## 4

"అక్కోళ్ల ఊరికి పోయి రావల్లా"

అన్నం తింటున్న రెడ్డెన్న, వడ్డిస్తున్న ఈశ్వరమ్మ సురేంద్ర మాటలను విన్నా విననట్టుగానే ఉండిపోయారు.

"అక్కోళ్ల ఊరికి పోయి రావల్లా" మళ్లీ చెప్పాడు సురేంద్ర అమ్మ ముఖంలోకి చూస్తా.

"నెలకాలా కదరా పొయ్యొచ్చి" అన్నాడు రెడ్డెన్న.

లక్ష్మికి పెళ్లయి ఆర్నెల్లవుతాంది. రాయచోటి దగ్గర చిన్న పల్లెటూళ్లో ఇచ్చారు. సురేంద్ర ఇంటర్ ఫెయిలై ఇంటికాడున్నాడు. తండ్రితోపాటు కొయ్యపనికి పోతున్నాడు.

"చూడాలనుంది" ముక్తసరిగా అన్నాడు.

"సరే పోదువులే... రేపు పనయిపోతాది గదా... లెక్క చూద్దామన్నేడు ఆసామి. మన్నాడు పోదువులే" అన్నాడు రెడ్డెన్న.

ఆ మాటలతో అప్పుడే అక్కను చూసినంతగా సంతోషించాడు సురేంద్ర. రెండు రోజులకు పని పూర్తయింది. మూడోరోజు ఎనభై రూపాయలు తీసుకుని లక్ష్మి వాళ్ల ఊరికి బయలుదేరాడు.

"ఆన్నే కుచ్చోని ఉండిపోవద్దు. రేపొచ్చేసేయ్" అంది ఈశ్వరమ్మ కొడుకుతో.

రాయచోటిలో బస్సుదిగి రెండు డజన్ల అరటి పండ్లు, నాలుగు మూరల పూలు, నాలుగు గులాబీలు తీసుకున్నాడు. అక్కడి నుంచి రెండు మైళ్ల దూరం నడచుకుంటా పోయి లక్ష్మి ఇల్లు చేరాడు.

ఇంటి బయటే ఖాళీబిందెతో ఎదురొచ్చింది లక్ష్మి.

తమ్ముణ్ని చూడగానే కళ్లలో మెరుపులు. కుశల ప్రశ్నలయ్యాయి. అక్కచేతిలోంచి బిందెను బలవంతంగా లాక్కుని చేతిపంపు వద్దకు నీళ్లకు వెళ్లాడు సురేంద్ర. గబగబా తొట్టికి అయిదు బిందెల నీళ్లు పోశాడు.

"ఇంగ చాల్లేరా... నీళ్లు కాగినాయి పోసుకోపో" అంది లక్ష్మి.

సురేంద్ర అక్కమాటలు పట్టించుకోలేదు. తొట్టి నిండేంతవరకు నీళ్లు మోసి, తర్వాత స్నానానికి వెళ్లాడు. లక్ష్మి అత్తామామలకు, భర్తకు కూడా సురేంద్ర అంటే ఇష్టం. ఇది ఆడవాళ్ల పని, అది మగవాళ్ల పని అని భేదం లేకుండా అన్ని పనులూ చేసే సురేంద్రను చూస్తే ఆ పల్లెల్లో చాలామందికి అశ్చర్యం, వింతానూ.

లక్ష్మికున్న ఏకైక ఆప్తమిత్రుడు తమ్ముడు. వాడితో తన కష్టసుఖాలు చెప్పుకుందామంటే ఇంట్లో అత్తామామలు ఉన్నారు. మాసిన బట్టలు గంపలో వేసుకుని, తమ్ముణ్ని వెంటబెట్టుకుని కుంట దగ్గరకు పోయింది లక్ష్మి.

సురేంద్ర సబ్బు వేస్తావుంటే, లక్ష్మి బట్టలు ఉతకతా ఉంది.

ఉతికిన బట్టలను సురేంద్ర నీళ్లలో తీసి ఇస్తావుంటే, లక్ష్మి పక్కన బండ మీద వాటిని ఆరేస్తా ఉంది. బట్టలు ఆరేంత వరకూ ఇద్దరూ పక్కనే ఉన్న కానుగ చెట్టు కింద కూర్చుని మాట్లాడుకుంటూనే ఉన్నారు.

కోడలిగా తన కష్టాలను, భర్తతో తన సంతోషాన్ని లక్ష్మి చెప్తుంటే సురేంద్ర ఆసక్తిగా వింటున్నాడు.

## 5

"ముస్తఫా అన్నా... ఎట్లన్నాగానీ, రెండువేలు తండల్‌కు తీసీన్నా... నేను వారం వారం కట్టేస్తాను"

"ఎట్ల కడ్తావు సురేంద్రా..." అన్నాడు మిషన్ సూదికి దారం ఎక్కిస్తూ ముస్తఫా.

"అక్కారంపల్లి రోడ్లో వుండాడే... మాధవ నాయర్, ఆయన దగ్గరికి కొయ్య పనికి పోతాండా. రోజుకు యాభై రూపాయలు.... దినమ్మూ పనుంటుందంటన్నా..."

"ఇప్పుడెందుకు నీకు రెండువేలు?"

"...."

"చెప్పు... ఎందుకు రెండువేలు.... సైకిల్ కొనుక్కుంటావా...?" చొక్కా కుడుతూ ప్రశ్నించాడు ముస్తాఫా.

"కాదన్నా... ఇంతకు ముందు కూడా చెప్పినా... నువ్వు మరిచిపోయినావు. మాది చాలా పేదపరిస్థితి. మా అక్కకు పెండ్లికి కమ్మలు పెడతామన్నేం. ఇప్పటికి మా అక్కకు పెండ్లయి మూడేండ్లయితాండాది. ఇంగా పెట్టలా... మావోళ్లు మంచోళ్లే.... ఎంత మంచోళ్లయినా అక్కను అత్తామామ ఏదన్నా అంటా ఉంటారంటన్నా... మా అక్కకు కమ్మలు చేపిద్దామని...." వివరించాడు సురేంద్ర.

"ఔనౌను... ఇంతకు ముందుకూడా చెప్పిన్నేవు. మరిచిపోయినా.... తండల్‌కు రామసుబ్బారెడ్డి ఇస్తాడు. నేను చెప్పి తీసిస్తాలే..." హామీ ఇచ్చాడు ముస్తాఫా.

అప్పుడే కమ్మలు తీసుకుపోయి తన అక్కకు ఇచ్చినంతగా సంబరపడ్డాడు సురేంద్ర. మరో నాలుగు రోజుల్లో రెండువేల రూపాయలు తండల్‌కు తీసుకున్నాడు. వేయికి వంద వంతున రెండు వందలు పట్టుకుని పద్దెనిమిది వందలు ఇచ్చారు సురేంద్రకు.

డబ్బు చేతికి వస్తానే బజారు వీధికి వెళ్లాడు. నాలుగైదు షాపులు తిరిగి పదహారు వందల యాభై రూపాయలు ఇచ్చి నాలుగు గ్రాముల బంగారు కమ్మలు కొన్నాడు. ఆ రోజు రాత్రంతా ఎప్పుడూ లేనంత ఆనందంగా గడిపాడు. మరుసటి రోజు తిరుపతిలో మూడు గంటల బస్సుకే బయల్దేరాడు. రాయచోటికి పోయేప్పటికి ఆరయింది. అక్కడ పూలు పండ్లూ తీసుకుని లక్ష్మి వాళ్ల వూరు చేరేప్పటికి ఏడుగంటలయింది.

నెత్తిన పేడగంపతో దారిలో ఎదురుపడింది లక్ష్మి. ఆమె సంకలోని రెండేళ్ల కూతురు హరిత సురేంద్రను చూడగానే మీదకు ఒంగబడింది.

లక్ష్మి గబగబా వెళ్లి పేడను దిబ్బలో కుమ్మరించేసి వచ్చింది. అప్పటికింకా హరిత మేనమామ సంక దిగలా.

తమ్ముని ముఖంలో ఎప్పుడూ లేనంత సంతోషాన్ని లక్ష్మి పసిగట్టింది.

"ఏరా... నీకేదన్నా వుద్యోగం వచ్చిందా..." అడిగింది నవ్వుతూ.

"లేదక్కా... నా చదువుకు ఉద్యోగం ఏమొస్తాది.... ఇంట్లోకి రా చెబుతా" అంటూ లోపలికి వెళ్లాడు.

మాసిక ముతక చీరలో వాడిన మందారంలో ఉన్న లక్ష్మి తమ్ముని్న అనుసరించింది.

ప్యాంటు సీక్రెట్ జోబీలోనుంచి చిన్న డబ్బాను బయటకు తీసి "ఏంటియో చెప్పుకో చూద్దాం" అన్నాడు.

లక్ష్మికి అవి కమ్మలే అయి ఉంటాయనిపించింది. తమ్ముడి చేతిలోనించి లాక్కుని తెరచి చూసింది. తళతళలాడుతూ బంగారు కమ్మలు.... తనను అత్తగారింట మాటలు పడేలా చేసిన కమ్మలు. వాటిని చూడగానే లక్ష్మి కళ్లలో నీళ్లు సుడులు తిరిగాయి. అవి ఆనంద బాష్పాలని సురేంద్రకు అర్థమయింది.

చెవి రంధ్రాలకున్న పుల్లలు తీసేసి కమ్మలు పెట్టుకుంది లక్ష్మి. అద్దంలో నాలుగైదుసార్లు

చూసుకునింది. "బాగుండాయారా...." ప్రశ్నించింది. "నా తమ్ముడు తెచ్చిన ఓయి... ఎందుకు బాగుండవు" తనే జవాబు చెప్పింది.

వీధిలోకి పరుగున వెళ్లింది లక్ష్మి, అత్తామామలకు, ఇరుగూ పొరుగుకూ తన చెవుల్లోని కమ్మలను చూపడానికి. అక్క సంతోషాన్ని చూసేప్పటికి సురేంద్ర కళ్లలో కూడా ఆనందబాష్పాలు.

## 6

లక్ష్మి దగ్గర నుంచి సురేంద్రకు జాబు వచ్చింది. ఆర్నెల్ల కాలంలో వచ్చిన పదో జాబు అది. సురేంద్ర పనినుంచి సాయంత్రం ఇంటికి వస్తానే జాబు ఇచ్చింది రత్న.

సురేంద్రకు పెళ్లయి ఆర్నెల్లవుతా ఉంది. తిరుపతిలోనే అద్దె ఇంటిలో ఉంటున్నారు. జాబును తెరచి భార్యకు చదివి వినిపించాడు. అక్కోళ్ల ఊరికి పోలేక పోతున్నందుకు సురేంద్రకు బాధగా ఉంది.

"ఏంబా... మీ అక్క అంతగా బాధపడతా జాబు రాసిండే. ఒక్కసారన్నా పోయొస్తే బాగుంటాది" అంది రత్న.

"నాకూ పోవాలనే ఉండాది. దుడ్డుండద్దా... నాకు రోజుకు ఎనభయ్యే కదా కూలి. ఆదివారాలు పనుండదు. నెలకు రెండువేలకు మించి రాదు. ఇంటి బాడుగకు, స్టౌకు కిరోసిన్, సరుకులు, వడ్డీలు... నువ్వే చూస్తాండావు గదా... నెలనెలా ఎంతో కొంత అప్పే అయితాండాదే. అక్కోళ్ల వూరికి ఇద్దరం పోయి రావాలంటే చార్జీలకే నూట ఎనభైదాకా కావాల. పూలూ పండ్లూ.... పోకపోక పోతాండాం.... పిల్లోల్లకన్నా గుడ్డలు తీసుకుపోవద్దా.... కనీసమంటే ఐదునూర్లన్నా కావాల" వివరించాడు దిగులుగా సురేంద్ర.

"అయితే అయ్యింది. పోకపోతే సురేంద్రను పెండ్లాం రానీయలేదంటారు. అప్పయినా సరే.... పొయ్యేసి వద్దాం" అంది రత్న.

మరో వారం రోజులకు ఆలూమగలు లక్ష్మి వాళ్ల వూరికి బయలుదేరారు. లక్ష్మి ముగ్గురు పిల్లలకు గాంధీ రోడ్డులో బట్టలు కొన్నారు. పూలూ పండ్లూ తీసుకున్నారు. బస్సు దిగి పల్లెకు పోయేప్పటికి తొమ్మిది దాటింది.

లక్ష్మి ఇంటి దగ్గర వంట చేస్తా వుంది. ఆమె భర్త రాయచోటికి పనికి పోయాడు. పెద్ద పిల్లలిద్దరూ బడికి పోయారు. చిన్నవాడు దగ్గరకు రాకపోయినా బలవంతంగా లాక్కున్నాడు సురేంద్ర.

"మామరా... మామ.... ఎప్పుడన్నా వస్తాంటే కదా గుర్తుండేదానికి... రెండు మూడు నెలలకన్నా ఒకసారి వస్తేనేంరా...?" అంది లక్ష్మి.

"ఎట్లక్కా వచ్చేది... సంసారంలో దిగినాంక ముందంత తీరిక ఉంటుందా? దగ్గిర కాకపాయ. ఇంతకు ముందయితే నెలరోజులు పనికి పోకపోయినా అడిగే వాళ్లుండరు. ఇప్పుడు ఒకరోజు పనికి పోకపోయినా ఇబ్బందే గదా" అన్నాడు సురేంద్ర.

"ఇబ్బందులు ఎప్పుడూ ఉండేటియేలే. అట్లని వచ్చేదే మానుకుంటారా. కాళ్లూ చేతులు కడుక్కొని రాపోండి... తిందురు".

"అంగడి పెట్టినారా పిన్ని" అడిగింది రత్న.

"ఔనమ్మా.... ఎంత... మీ చిన్నాయన రెండువేలకు సరుకులు తెచ్చినాడు. ఫస్టీలో... అంతే, ఇప్పుడు ఆయనకు ఒంట్లో బాగుండటం లేదు గదా... ఒక రోజు పనికిపోతే వారం రోజులు పోడు. ఇంట్లో అందరికీ తిండి పెడతాండేది ఈ అంగడేమ్మా" వివరించింది లక్ష్మి.

లక్ష్మిలో ఒక విధమయిన ఆత్మస్థైర్యం కనిపించింది సురేంద్రకు.

ఆరోజు ఉండి మరుసటి రోజు బయల్దేరేశారు సురేంద్ర, రత్న.

"రాక రాక వచ్చినారు... వారం దినాలన్నా ఉండండి" అంది లక్ష్మి.

"లేదులేక్కా... పోకపోతే ఇబ్బంది. ఆడ పనులుగూడా అర్జంటు. ఈసారి వచ్చినప్పుడు ఉంటాంలే... పల్లెకు పోయి రెండు నెలలవుతా ఉండాది. అమ్మోళ్లకు జాబు రాసినా రేపు నెల్లో అయినా అమ్మోళ్ల దగ్గరికి పోయిరావాల"

"అప్పుడు ఈడికి రాండి"

"ఎట్లో చూస్తాంకా.... పోయొస్తాం" అని చెప్పి సురేంద్ర, రత్న ఎలబారినారు.

తమ్ముణ్ని, రత్నను చూస్తానే నిల్చుని ఉంది లక్ష్మి.

వాళ్ల దూరమయ్యారో... లక్ష్మి కళ్లు నీళ్లతో నిండాయో.... మసకగా కన్పించారు.

## 7

ఆ రోజు ఆదివారం.

పనేమీ లేకపోవడంతో ఏడున్నరయినా నిద్ర లేవలేదు సురేంద్ర. పాప లేవడంతో పాలిస్తా మెలకువగానే పడుకోనుంది రత్న.

"సురేంద్ర వాళ్ల ఇల్లు ఏదండీ" బయట ఎవరో అడుగుతున్నారు.

'ఈ గొంతు ఎక్కడో విన్నట్టుందే' అనుకుంది రత్న.

"ఆ ఇల్లే..." పక్కింటి వాళ్లు చెబుతున్నారు.

వెంటనే తలుపు తడుతూ "సురేంద్రా... రత్నా..." అంటూ పిల్చారు బయటినుంచి. అది స్త్రీ గొంతు. ఎవరబ్బా అనుకుంటూ పాపను సంకలో వేసుకుని వెళ్లి తలుపు తీసింది రత్న.

చేతిలో సంచితో, గుండుతో ఒక ఆడమనిషి నిలబడుకోనుంది. ఎవరో పోల్చుకోలేక పోయింది రత్న.

"ఏమ్మా... బాగుండారా" అంటూ లోపలకు వచ్చి "వీడింకా పడుకోనుండాడా" అందామె.

అప్పటికి గుర్తుపట్టింది రత్న.

"పిన్నీ బాగుండారా... నేను గుర్తు పట్టనే లేదు... గుండు కొట్టేసినావు. సన్నగా అయిపోయిండావు, బా... ఏంబా... ఎవురొచ్చినారో చూడు" అంటూ సురేంద్రను లేపింది రత్న.

సురేంద్ర కండ్లు పులుముకుంటూ లేచి కూర్చున్నాడు.

చాపమీద కూర్చుంది లక్ష్మి.

"ఏంకా... బాగుండావా... ఎప్పుడొచ్చినావు... పిల్లోల్లు బాగుండారా... ఆ గుండేమి?" ప్రశ్నలు కురిపించాడు సురేంద్ర.

"బాగుండాంరా... మీరంతా బాగుండారా... తిరుమలకు పోయిన్నేం... కొండమింద గుండు కొట్టించినా"

"ఒగదానివే వచ్చినావా పిన్నీ..."

"లేదమ్మా... అందరం వచ్చినాం... పల్లోల్లు మాతోపాటు ఇంగా పదిమంది వచ్చిండారు. వాళ్లంతా నడుచుకోని కొండదిగతాండారు. నేను మిమ్మల్ను చూద్దామని బస్సులో వచ్చేసినా" అంది లక్ష్మి.

"మంచి పని చేసినావులేక్కా... ఇంత దూరం వచ్చి ఇంటికి రాకుండా పోతారా ఎవురైనా" అన్నాడు సురేంద్ర.

"ఆc... మీరు బలే వస్తాండార్రా. రెండేండ్లయితాండాది, మీరు మా ఇంటికొచ్చి. కనీసం ఆర్నెల్లకు ఒకసారయినా వచ్చిపోతే ఏం... అందర్నీ చూస్తే అదొగ సంతోషం. మీకు పాప పుట్టినాంక నేను చూడనేలే... అమ్మోళ్లు చెప్తాంటారు. పాప చాలా బాగుంది. అంతా సురేంద్ర పోలికే అని. నేనిప్పుడు వచ్చింది మిమ్మల్ను చూడనుకాదు. పాపను చూడను వచ్చినా" అంది లక్ష్మి. అప్పటికే రత్న దగ్గరనుంచి పాపను తీసుకుని ఒళ్లో కూర్చోబెట్టుకుని సంచిలోంచి బిస్కట్ ప్యాకెట్ తీసి ఇచ్చింది.

"యాడక్కా... పనులు సరిగా ఉండటంలేదు. బాగా ఇబ్బందిగా ఉంటాండాదక్కా... యాడికీ పొయ్యేదే లేదు" దిగులుగా చెప్పాడు సురేంద్ర.

"ఏం బా... టిఫిను చపాతీ చేసుకుందామా..." అంది రత్న.

"అమ్మో... అంతసేపుండునులేమ్మా... గంటకంతా ఎళ్లిపోతా... సద్దన్నం ఉంటే చాలు" అంది లక్ష్మి.

"చపాతీలు చేసుకుందాంలే పిన్నీ... అంగడికీ పోయి గోధుమపిండి తేపో" సురేంద్రకు పని పురమాయించింది రత్న.

లక్ష్మి వద్దంటున్నా సురేంద్ర విన్పించుకోలేదు. అంగడికి పోయి గోధుమపిండి తీసుకొచ్చాడు. టిఫిను తినేప్పటికి తొమ్మిదయింది.

పాపతో లక్ష్మి ఆడుకుంటా ఉంది.

"ఇట్రాబ్బా..." అంది ఇంటిముందుకు పోయి రత్న.

సురేంద్ర వెళ్లాడక్కడకు.

"మీ అక్క రాకరాక వచ్చింది. మళ్లా ఎప్పుడొస్తాదో ఏమో.. మనం పొయ్యేదీ అంతంత మాత్రమేగదా. చీర జాకెట్టు పెడితే బాగుంటుందేమో" అంది భర్తతో.

"చీరా జాకెట్టా... ఈ వారం కూలి డబ్బు ఉందనుకో.. బాడుగ కట్టాలా... తండల్‌కు కట్టాలా...."

"సరే... అయ్యన్నీ మామూలేలే... మనం ఎట్లోగట్లా చేసుకుందాంలే. ముందుగా అంగడికి పోయొద్దాం పదా" సురేంద్రను తొందర చేసింది రత్న.

లక్ష్మితో "ఇంట్లోనే ఉండుకా... ఇప్పుడే వస్తాం" అని చెప్పి రత్నను సైకిల్‌లో కూర్చోబెట్టుకుని బట్టలంగడికి వెళ్లాడు సురేంద్ర. మూడువందల పాతిక రూపాయల్లో చీరా జాకెట్టు తీసుకొచ్చారు.

"ఇప్పుడెందుకురా ఇయ్యన్నీ" అంది లక్ష్మి. అమె ముఖంలో సంతోషం.

లక్ష్మి కట్టుకోనుండే చీర కూడా చాలా పాతబడిపోయింది.

"ఇంగ నేను ఎలబారేస్తారా... మీ బావోళ్లు ఈయరవకు వచ్చి బస్టాండులో ఉంటారు. మీరు ఆర్నెల్లకు ఒకసారయినా వస్తాండండి" అంది లక్ష్మి.

"సరేక్కా" అంటూ లక్ష్మిని దిగబెట్టడానికి సైకిల్ తాళాలు తీసుకుని వీధిలోకి వచ్చాడు సురేంద్ర.

## 8

సురేంద్ర చాలా అసహనంగా ఉన్నాడు.

అరగంటనుంచి బస్టాండులో బస్సుకోసం ఎదురుచూస్తున్నాడు. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

'డ్యూటీకి టైమవుతాండాది. ఈ బస్సు ఇంగా రాలేదే' అనుకున్నాడు.

ఇంతలో అక్కడకు ఒక ఆటో వచ్చి ఆగింది. అందులోనుంచి పాతిక సంవత్సరాల లోపలున్న అమ్మాయి, అబ్బాయి దిగారు. ఇద్దరూ వచ్చి సురేంద్ర పక్కన బెంచీ మీద కూర్చున్నారు.

"మళ్లా ఎప్పుడొస్తావురా..." అంది ఆ అమ్మాయి.

"ప్రతినెలా సెకండ్ సాటర్‌డే వచ్చేస్తాకా... మధ్యలో ఎప్పుడయినా లీవున్నే వచ్చేస్తా" అన్నాడా అబ్బాయి.

"బాగా చదువుకో..."

"సరేక్కా.. బస్సువస్తాంది... నువ్వు జాగ్రత్త. ఫోన్ చేస్తాంటాంలే..." అంటూ హడావిడిగా రోడ్డుపైకి వచ్చి చేయి ఊపాడు. గూడూరు బస్సు ఆగింది. ఆ అమ్మాయి కూడా చేయి ఊపింది. బస్సు కనుమరుగు అయ్యేంతవరకు అక్కడే ఉందా అమ్మాయి. చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ ఆటో ఎక్కింది.

అక్కా తమ్ముళ్లను చూసినప్పటినుంచి సురేంద్రకు తన అక్క గుర్తొస్తావుంది.

లక్ష్మి సురేంద్ర ఇంటికి వచ్చి పోయి మూడేళ్లవుతా ఉంది. తర్వాత సురేంద్ర కూడా వాళ్ల ఇంటికి పోలేదు.

చిన్నపిల్లలను... అక్కా తమ్ముళ్లను... అన్నా చెల్లెళ్లను చూసినప్పుడు సురేంద్రకు తన బాల్యము, అక్క గుర్తుకు వస్తారు. చిన్నప్పుడు తన అల్లరిని ఇష్టంగా భరించిన అక్క గుర్తొచ్చి కళ్లు చెమ్మగిల్లుతాయి. తను మళ్లీ పిల్లవాడైపోయి అక్క వీపు మీదెక్కి వీధులింటీ, పొలాలింటీ తిరగలానిపిస్తుంది. వెంటనే అక్కోళ్ల వూరికి పోవాలనిపిస్తుంది.

వచ్చే జీతం చాలక ఏ నెలకానెల ఇంకా ఐదారు వందలు అప్పు చేయాల్సిన పరిస్థితి. బడికి పోతున్న కూతురు, ఇంటి అద్దె, వడ్డీలు... ఆదాయం కన్నా జీవన వ్యయం ఎంతో వేగంగా పెరుగుతున్న కొద్దీ మనుషుల మధ్య బంధాలు పలుచబడటం, మనుషుల మధ్య దూరాలు పెరగడం సురేంద్ర గమనిస్తూనే ఉన్నాడు. ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో, తనకు తనే సర్దిచెప్పుకుంటున్నాడు... యంత్రంలా కన్పిస్తున్నాడు.

ఎప్పటికప్పుడు ఆత్మీయుల మధ్య పెరుగుతున్న దూరాలను తగ్గించాలనే అనుకుంటున్నాడు. అనుకుంటూనే మూడేళ్లు గడిపేశాడు. దూరం తగ్గడానికి ఇంకెంత కాలం పడుతుందో..., అసలు దూరం తగ్గించగలడో లేదో...!?

ఇంతలో సురేంద్ర వెళ్లాల్సిన బస్సు వచ్చింది.

అంతవరకు తనలో చెలరేగిన ఆలోచనలన్నీ అదృశ్యమయ్యాయి...

ఆఫీసు సమయం మించిపోతోందని కంగారు మొదలయింది. పరుగున వెళ్లి బస్సెక్కాడు...!

మనభూమి, డిసెంబర్ 2005